# జ్ఞానసుందరి

## "LIDO"

పారడైజ్ టాకీస్ నుంచి మురళీ, జ్ఞానసుందరి బయటకువచ్చి కారుదగ్గరకు నడవబోతూండగా యీ అక్షరాలు ఎదురుగా ఎర్రగా మెరుస్తూ కనిపించాయి.

"లిడో" అన్నది జ్ఞానసుందరి, ఆ అక్షరాలు చదువుతూ.

"హెూక్లాస్ రెస్టారెంట్ — ఐమీన్ బార్, మనం ఎక్కడో అక్కడ భోజనంలాంటిది చెయ్యాలికదా, ఇందులోకి పోదామా?" అని అడిగాడు మురళి ఆమె ముఖంలోకి చూస్తూ.

"మీకు ఆనందమైతే — నాకిష్టమే" మృదువుగా అన్నది ఆమె.

ఆమె నిశ్చలత్వానికి అతను కాస్త చలించాడు. అయినా బయటపడకుండా 'పద' అంటూ అటు కేసి నడిచారు.

బయట దర్వాన్ లేచి నిలబడి సలాంచేసి తలుపు తెరిచాడు. ఒక్కసారిగా లోపలనుండి వివిధ శబ్ద తరంగాలు బయటకు దూకాయి. ఆమె భుజంచుట్టూ చేయివేసి అతను లోపలకు తీసుకుపోయాడు.

ఇప్పుడు మరింత దూకుడుగా వినవస్తోంది పాశ్చాత్య జంత్ర సంగీతం. ఆమె అటుకేసి తలతిప్పి తన విశాలనయనాలతో తిలకించింది.

నల్లకోట్లు ధరించిన వ్యక్తులు పియానో, సితార్, మేండోలిన్‌లమీద తన్మయులై వాయించేస్తున్నారు. ఒక స్త్రీ పురుషుడు ఒకరిని ఒకరు తాకుతూ అధునాతన పాశ్చాత్య నృత్యం ప్రదర్శిస్తున్నారు. ఆ స్త్రీ సన్నగా, పొడవుగా, లేతగా మెరుపుగా వుంది. ఆంగ్లో-ఇండియన్ కాదు. బహుశా ఏ పార్శీ మహిళయో, సింధివనితయో కావచ్చు. అలంకారంలో కూడా ఆడంబరం లేదు. చీర, జాకెట్టు యిత్యాదులే. హెయిర్ స్టయిల్ మాత్రం ఒక కెరటంలా పైకిసాగి అధునాతనంగా వుంది పురుషుడు పాంటువేసుకొని ఇన్‌షర్టు చేశాడు. చాలా చలాకీగా, చురుగ్గా సాగిపోతున్నది డ్యాన్సు.

హాలంతా పెద్దపెద్ద టేబిల్సు, సోఫాలు, వివిధ తరహాల స్త్రీలు, పురుషులు, బల్లలమీద రకరకాల తినుబండారాలు, శాకాహారం; రంగురంగుల గ్లాసులలో పలురకాల పానీయాలు... అట్టహాసంగా వుంది. తింటూ, పానీయాలు

చప్పరిస్తూ, వాళ్ళలో వాళ్లు కబుర్లు చెప్పుకుంటూ మధ్య మధ్య డాన్స్ తిలకిస్తున్నారు.

"ఆ సోఫా ఖాళీగావుంది" అంటూ ఒక కార్నర్‌లో వున్న సోఫా కేసి తీసుకుపోయాడు మురళి ఆమెను.

సోఫాలో అతని ప్రక్కన కూర్చుని చుట్టూ మరోసారి కలయజూసింది జ్ఞానసుందరి. ఒక్కొక్క టేబిల్ దగ్గరా నలుగురయిదుగురు దాకా కూర్చుని వున్నారు. మంచి మంచి దుస్తుల్లో మెరిసిపోతున్నారు. ఎరిస్టోక్రటిక్ ఫామిలీలని చూడగానే తెలిసిపోయింది. కొంతమంది స్త్రీలు లేకుండా వచ్చారు. కొంతమంది స్త్రీలతో వచ్చారు. స్త్రీల ప్రవర్తన చాలా సభ్యతాయుతంగా గౌరవనీయంగా వున్నది. మెల్లిగా ప్రక్కవున్న తమ తాలూకు పురుషులతో నవ్వుతూ మాట్లాడుతూ, వాళ్లు తింటూ త్రాగుతూవుంటే, తాము అప్పుడప్పుడు గ్లాసుల్లో కలిపిపోస్తూ, తాము మాత్రం చిప్సో, ఐస్‌క్రీమో, బిరియానీయో తింటూ కాలక్షేపం చేస్తున్నారు. ఒకరిద్దరు వనితలు మాత్రం అప్పుడప్పుడూ పొడుగాటి గ్లాసుల్లో బీరుగావును చప్పరిస్తున్నారు, అక్కడక్కడా ఓ 'యంగ్ లేడీ' సిగరెట్టు కాలుస్తోంది. అయినా ఎక్కడా సభ్యతకు లోటురాకుండా నియమితంగా వాతావరణం ముందుకు సాగుతోంది. అసలీ వాతావరణంలో ఏం చేసినా సభ్యతగానే పొడగట్టుతోంది. ఒకచోట నలుగురయిదుగురు మగవాళ్ళు కూర్చున్నారు. అందులో ఒకడు కొంచెం డోసు ఎక్కువపడిందో, లేక చిలిపితనానికి కావాలనో అప్పుడప్పుడూ నిలబడి కాస్త అల్లరి చేసు

న్నాడు. డాన్స్ చేసేవాళ్ళని చేతులు త్రిప్పుతూ, నడుం వొంచుతూ అనుకరిస్తున్నాడు. "లలలల్లా" అని పాడుతున్నాడు. బ్యాండ్ వాళ్ళమీద జోక్స్ విసురుతున్నాడు. అతని స్నేహితులు అతన్ని ఖుషీచేస్తూ తామానందిస్తున్నారు. అయినా ఆ వాతావరణంలో అతని ప్రవర్తన ఎబ్బెట్టుగాగాని, జుగుప్సాకరంగాగాని గోచరించలేదు. అదీ నాగరికతలో ఓ భాగమే అనిపించింది. ఓ సిక్కుమనిషి — గడ్డాలున్నాయి. ఫుల్ సూట్ వేసుకుని అటూ యిటూ ఏదో పనిమీదవున్నట్లు తిరుగుతున్నాడు. అతని వాలకంచూస్తే ఆ హోటల్ యజమానిలా వుంది. జ్ఞానసుందరి అక్కడున్న స్త్రీలను మరోసారి శ్రద్ధగా ఆసక్తికరంగా పరిశీలించింది. మళయాళీలు, సింధీలు, మహారాష్ట్రీలు, ఆంగ్లోఇండియన్‌లు ఎక్కువగా వున్నారు.

డ్యాన్స్ అయిపోయింది. కూర్చున్నవారంతా అటు తలలు త్రిప్పి అభినందన పూర్వకంగా కరతాళధ్వనులు చేశారు. మురళికూడా చిరునవ్వు ముఖంతో తప్పట్లుకొట్టాడు. డాన్స్ చేసిన వాళ్ళిద్దరూ ఒకరిప్రక్క ఒకరు నడిచి ఒక బల్ల చుట్టూ కూర్చున్న తమ స్నేహితుల్ని చేరుకున్నారు. తాము కూడా కూర్చుని విందులో పాల్గొనసాగారు. కాసేపటివరకూ మ్యూజిక్ ఆగిపోయి నిశ్శబ్దం అలుముకొంది.

మురళి ముందుకు వొంగి సిగరెట్ వెలిగించాడు. ఒకటి రెండు సార్లు హాయిగా పొగవిడిచి "ఇక్కడ కూర్చున్న వాళ్ళంతా సభ్యమహిళలే. సరదాపుడితే వాళ్ళ భర్తలతోనో స్నేహితులతోనో కాసేపు నృత్యం చేస్తారు. సిగ్గుగానీ, అభి

మానంగానీ పడరు. డ్యాన్సింగ్ క్లబ్బులు వేరే వున్నాయి. అక్కడి సందర్భం కాస్త వేరు" అన్నాడు వివరించి చెబుతున్నట్లు.

ఆమె తల ఊపి వూరుకుంది.

మురళి మెనూ బుక్ చేతుల్లోకి తీసుకుని పేజీలు త్రిప్పుతూ "ఏం తీసుకుంటావు జ్ఞానా?" అని ప్రశ్నించాడు ఎంతో అపేక్షగా.

"నాకు ఆకలిగా లేదండీ" అన్నదామె.

"అబ్బే! తీరా ఇక్కడకు వచ్చి ఏమీ తీసుకోకుంటే ఎలా ? నీకు యిష్టమైనవి తెప్పిస్తాను. వెజిటబుల్ కట్‌లెట్, బ్రెడ్ టోస్ట్, చిప్స్, క్వాలిటీ ఐస్‌క్రీమ్... ఏం ?"

"అబ్బో ! అంతలిస్టా? సరే మీ యిష్టం" అన్నదామె నవ్వుతూ. అట్లా నవ్వుతున్నప్పుడు ఆమె లేత చిగుళ్ళు, పలుచని అందాన్ని ప్రదర్శిస్తూ బయట పడ్డాయి.

బేరర్ ప్లేట్లూ, ఫోర్కు, నైఫ్, దుస్తులు చెడిపోకుండా వొళ్ళో వేసుకునే క్లాత్ తీసుకుని అట్టహాసంగా వచ్చాడు. మురళి ఆమెకోసం కట్‌లెట్ వగైరాలు, తనకోసం బిరియానీ, ఆమ్లెట్ ఆర్డర్ చేశాడు.

"అంత ఎక్కువగా తాగకు డియర్! ఈ మధ్య నీ శరీరానికి సరిపడటం లేదు."

ఇంగ్లీషులో యీ మాటలు వినిపించి జ్ఞానసుందరి తల ప్రక్కకు త్రిప్పి చూసింది. ఓ పార్శీ సుందరి చిత్తుగా తాగేస్తోన్న తన ప్రక్కవానితో అంటోంది. అతను విపరీతంగా

తిన్నట్టున్నాడుకూడా. బల్లమీద స్థలం లేకుండా కొంచెం కొంచెం మిగిలిన తినుబండారాలతో ప్లేట్లు నిండి వున్నాయి.

"మరో లార్జి పెగ్ మాత్రమే డార్లింగ్" అన్నాడు అతను తడబడుతూన్న గొంతుతో బ్రతిమాలుతున్నట్లుగా. "తాగి చాలా రోజులయింది. హేవర్డ్స్ రుచి చూశాను. బీరూ, బ్రాందీ పుచ్చుకున్నాను. కాస్త రమ్మూ, జిన్నూ కలిపి నాలిక తడిపితే..."

"కాని బిల్లుసంగతి ఆలోచించావా? ఈపాటికి జీతంలో నాలుగో వంతుకు సరిపడివుంటుంది." అన్నదామె దిగులుగా.

అతను లాలింపుగా ఆమె భుజంమీద తట్టాడు. "ఇవాళ డబ్బు గురించి ఆలోచించకు డార్లింగ్! మన మేరేజి డే యీరోజు. సరిగ్గా నాలుగు సంవత్సరాలు. సరదాగా, ఖుషీగా యివాళంతా మళ్ళీ... మళ్ళీ సంవత్సరందాకా తాగితే అడుగు."

ఈ సంభాషణ వింటూన్న జ్ఞానసుందరి ముఖంలో ఎలాంటి హావభావాలు ప్రదర్శిత మౌతాయో అని ఆతృతగా చూశాడు మురళి. కాని నిశ్చలంగా, నిర్మలమైన సెలయేరులా వుంది ఆమె ముఖం.

"ఇలాంటి చోటికి తీసుకొచ్చానని విసుక్కుంటు న్నావా?" అని కొంచెం ఆగి అడిగాడు.

"ఊహుఁ" అని ఆమె తలత్రిప్పింది.

"ఈ వాతావరణం చూసి నీ కాశ్చర్యంగా వుందా?"

"లేదు."

"పోనీ యిక్కడ కూర్చుంటే నీ కెలావుంది అనుభూతి?"

"ఇంట్లో వున్నట్లుగానే వుంది."

ఆమె జవాబులు అతనిలో నిస్పృహను రేకెత్తించాయి. ఆమె అచంచల హృదయ గాంభీర్యంగల వ్యక్తి అని తెలుసు గాని, ఆ గాంభీర్యం అవధులు దాటని మహాశక్తి అని ఇప్పుడే తెలుసుకున్నాడు. ఇంతటి నిశ్చల నిగ్రహాలు ఏ స్త్రీలోనూ అతనింతవరకూ చూడలేదు. ఇంకా తరచి చూద్దామనిపించింది.

"నేను విస్కీ తీసుకోనా ?" అని అడిగాడు.

అతనివంక తల త్రిప్పయినా చూడలేదు. "తీసుకోండి" అంది.

"నేను తాగితే నీకు కోపం రాదా ?"

"రాదు."

ఎక్కడా కలవరపాటు లేదు. ఏమయినా వుంటే అది అతని వంతయింది. "పారిస్ షాంపెయిన్, ఎలా వుంది సినిమా ?" అని అడిగాడు ఆమె ముఖంలోకి చూస్తూ.

"నచ్చింది నాకు."

"అందులో కొన్ని దృశ్యాలలో మెరుపు మెరిసే వ్యవధిలో నగ్నంగా చూపించాడు. అలాంటి సినిమా నీకహాస్యం కలిగించలేదూ !"

"కొన్ని వేలమంది మేను మరచి ఆనందిస్తూన్న దృశ్యం నా ఒక్క దానికే అసహ్యమెందుకు కలిగించాలి ?"

"నువ్వు అతీతురాలివి కావచ్చుగా ?"

"ఇలాంటి స్వల్పమైన అంశాలను ఆధారం చేసుకుని అంటగట్టడం అన్యాయం" అంది జ్ఞానసుందరి కొంచెం నవ్వి.

అతని కేమనటానికి తోచలేదు. వ్రేళ్ళు బల్లమీద పెట్టి ఆడిస్తూండగా బేరర్ పదార్థాలు తీసికొచ్చి ప్లేట్లలో నింపాడు.

మరో అరగంటవరకూ యిద్దరూ ఆ హోటల్లో గడిపారు. ఈలోపుగా మరోజంట లేచివెళ్ళి కాసేపు నాట్యం చేసింది. తర్వాత కొంతసేపు ఆర్కెస్ట్రా పాశ్చాత్య సంగీతాన్ని వినిపించింది. బిల్ చెల్లించాక మురళి, జ్ఞానసుందరి బయటికి వచ్చారు.

ఆమె కట్టులో, బొట్టులో, తలదువ్వుకోవటంలో, శరీరపు తీరులో, నడకలో, కదలికలో, పెదవి కదల్చటంలో, కళ్ళలో, చూపులో చెప్పలేని వినమ్రతతో కూడిన ఆకర్షణ వున్నది. ఆమె పౌడర్ రాసుకోలేదు. లిప్‌స్టిక్ పూసుకోలేదు. హైహీల్స్ తొడుక్కోలేదు. మెరిసే దుస్తులు ధరించలేదు. అయినా ఆమెలో నిండుతనం వుంది. ఆమె సుందర నయనదళ కాంతుల్లో ఆత్మవిశ్వాసం, ఎవర్నీ చూసి జడుసుకోని స్థయిర్యం ఎట్టి సంఘటన నైనా ఎదుర్కోగల నిబ్బరం, యిన్‌ఫీరియారిటీ అంటే తెలియనితనం, అనురాగం, మానవత్వంమీద మమకారం, నలుగుర్నీ సమంగా చూడగల విశాలత్వం ద్యోతకమవుతున్నాయి. అతనిచెయ్యి పట్టుకుని ఆమె నడుస్తూంటే చూపరులు ముగ్ధులై తిలకించసాగారు. ఎవరినైనా స్వార్థరహితుల్ని చేసి, వారిలోని ప్రలోభాన్ని నశింపజేసే మంత్రశక్తి ఆమెవద్ద వున్నదేమో అనిపిస్తుంది ఆ సమయంలో చూస్తే. అజంతా శిల్పమూ, దంతపుబొమ్మా, చందనపు ప్రతిమా యిలాంటి ఉపమానాలతో ఆమెను పోల్చటం సరికాదు.

మామూలు మానవాంగన. అయితే సృష్టికి, ప్రకృతికి నిర్వచనం చెప్పే సహజ, సజీవ జ్ఞానసుందరి.

విశాలమైన రోడ్డుమీదుగా మెల్లగా కారు పోసాగింది. అతనిప్రక్కన తాకుతూ కూర్చుంది ఆమె. ఇద్దరిమధ్యా బరువుతో కూడిన మౌనం ఆవరించింది. ఈ బరువులో కాస్త ప్రశాంతత వుంది.

వీధికి యిరుప్రక్కలా పాదరస దీపకాంతీ, నడుస్తూన్న వివిధరకాల తరగతుల ప్రజానీకం, ఎడ తెరిపి లేకుండా పరిగిడుతున్న కారులూ, సిటీలో ప్రకృతి చోటుచేసుకొంటున్నట్లు స్ఫురింపచేసే యింపైన వాతావరణమూ, గిలిగింతలు పెట్టే చలిగాలీ, ఎటు చూసినా దూరాన మిణుకు మిణుకు మంటూన్న దీపాలూ విశాలంగా సాగి వీటిపై పరుపులా పరుచుకున్న టాంక్‌బండ్...

"హైదరాబాద్ బ్యూటీ నెట్" అన్నాడు మురళి తనలో తను అనుకుంటున్నట్లు.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"బెంగుళూరు, హైదరాబాద్ యివే నాకు నచ్చిన నగరాలు. ఇంత నిర్మలమైన ప్రశాంతత యీ రెండూ మినహాయించి ఎక్కడా లభించవు."

"మనలో వుంటుంది" అన్నదామె యీ సారి మౌనం ధరించకుండా.

"మనలో ఎంతవరకూ ఉంటుంది? కొంతవరకే. మిగతాది పరిసరాల మీద, మనకు సంబంధించిన సన్నిహిత

వ్యక్తులమీద ఆధారపడి వుంటుంది. ఒక్కసారి మనకు ఏదీ కలిసిరాకపోతే మనం చాలా దుర్బలులం అవుతాం."

"అలా అనుకోవటంలా నేను" అన్నది జ్ఞానసుందరి నిశ్చల కంఠంతో. "మన బలహీనతలు పరిసరాల మీదకు నెట్టడం కేవలం సాకు అవుతుంది. మన శాంతికి, తపనకూ మన ప్రవృత్తే కారణం. బలిష్టమైన గుండె, ధిటవైన మనసూ మనిషిని ఆనందానికి చేరువగా తీసుకువస్తుంది. అలాంటి వ్యక్తి పల్లెలోవున్నా, పట్టణంలో వున్నా ఆఖరికి అడవుల్లో వున్నా సుఖపడటం చాతనవుతుంది."

"అలాంటి శక్తి కలదానివా జ్ఞానా?" అని ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

ఆమె పెదవులమీద చిరుహాసం ఉదయించింది. "మన వివాహము జరిగి అయిదు రోజులయింది. మీ అనుగ్రహం వుంటే నాశక్తి అని అననుగానీ, నా మాటలయందు మీకు నమ్మకం కలిగిస్తాను" అంది మృదువుగా.

ఒక్కక్షణం అతను మాట్లాడలేకపోయాడు. తర్వాత "జ్ఞానా! నువ్వెవరివి?" అన్నాడు హఠాత్తుగా.

"ఒక స్త్రీని, అబలను, మీ అర్ధాంగిని."

"స్త్రీవి నిజమే, అందరిలాంటి స్త్రీవిమాత్రం కాదు. అర్ధాంగినన్నావు. ఆమాటమీద గురి కుదరటం లేదు."

"ఎందుకని? నామెళ్ళో పుస్తెకట్టటం అబద్ధమా?"

"పుస్తె ఒకటే మన యిద్దరిమధ్యా బంధం కాకూడదు. అంతకు మించిందీ అమూల్యమైనది నాకు కావాలి. నాకు జరగాలి. అందుకనే అనుమానం."

"అనుమానాలుండటం అవసరమే. లేకపోతే నమ్మకాలకు విలువ పెరగదు" అంది జ్ఞానసుందరి.

"ఒక విషయం నేనంటే తెల్లబోతావేమో?"

"ఏమంటే?"

"నన్ను పెళ్ళాడటంలో నువ్వు ముందూ వెనుకా ఆలోచించలేదంటే..."

"ఆలోచించానంటే?"

"ఇరవై నాలుగు గంటల్లో ఆలోచించటానికి నీకు అవకాశం ఎక్కడుంది?"

"అలా అంటారేం మురళిబాబూ!" అన్నదామె అతని ముఖంలోకి చూస్తూ. అతను చకితుడై ఆమెవైపు ముఖం త్రిప్పాను.

"మిమ్మల్ని అలా సంబోధించినందుకు అభ్యంతరం లేదుకదూ?"

"అభ్యంతరమా? ఒక దివ్యమైన అనుభూతి కుదిపేసింది."

"కృతజ్ఞురాలిని... ఇరవై సంవత్సరాలలో ఆలోచించలేనిది ఇరవై నాలుగు గంటలలో ఆలోచించ వచ్చంటాను నేను. కనీసం నాకు సంబంధించినంతవరకూ ఆ ఇరవై నాలుగు గంటలకూ అంత విలువ యిచ్చాను. ఆ విలువకు, నా నిర్ణయానికి యిహ తిరుగులేదు" అంది దృఢ స్వరంతో.

"అంత అహంభావం చేటు సుమా జ్ఞానా!"

"ఇది అహంకారమంటారా మీరు? ఆత్మవిశ్వాసమని అనుకోరూ?"

"పోనీ ఆత్మవిశ్వాసం, నీ ఆత్మ అంతగొప్పదా ఏం? అది నీకు కీడుచెయ్యదా ?"

"క్రమశిక్షణకు అలవాటుపడి, కలుషిత మవటమంటే ఏమిటో తెలియని ఆత్మ ఎందుకు కీడుచేస్తుంది మురళిబాబూ?"

"ఒకవేళ తాగుబోతునకుకో..."

"అది కేవలం దురలవాటు అంతమాత్రాన మనసుల్లో నమ్మకం నశించిపోను.

"వ్యభిచారిని అయితే...?"

ఆమె గుండెలనిండా గాలి పీల్చుకుంది.

"అలాంటి మనిషి అనుకుని నా ఆలోచన ప్రారంభించాననుకోండి."

"అలాంటప్పుడు అంత త్యాగం ఎందుకు చేయాలి నీవు ?"

"మీరు ప్రతిదానికి త్యాగం, ధర్మం, నీతి అని పెద్ద పెద్ద పేర్లు తగిలించ కండి మరి ఏదో ఒక లోపాన్ని ఆధారం చేసుకుని వ్యక్తిని చదవకూడదు. సంపూర్ణంగా అన్ని కోణాల నుంచీ అవలోకించగలగాలి. అప్పుడా మనిషి హిమాలయంగా దర్శనమిస్తే యీ లోపం తుషారబిందువులా కరిగి కారి పోతుంది."

"నేను హిమాలయాన్ని కాదుగా ?"

ఆమె మందహాసం చేసింది. "దయవుంచి ఆ విషయం మాత్రం గ్రుచ్చిగుచ్చి అడక్కండి. నేను కూడా కొన్ని విష యాలలో లజ్జితురాలను అవుతూంటాను. అంత ముఖాముఖి ఏం మాట్లాడను చెప్పండి."

ఆమె చెప్పింది నిజమే. ఆ చాలీ చాలని వెల్తుర్లో ఆమె ముఖంమీద తరుణారుణ కాంతి వ్యాపించటం అతను చూశాడు. అతడి మేను పులకరించినట్లయింది.

కారు శాంతినగర్ ప్రవేశించి, చివరకు ఒక పెద్ద భవనంముందాగింది. గేటుదగ్గర నిలబడివున్న ప్యూన్ కంగారు పడుతూ తలుపులు తెరిచాడు. కారు లోపలకు సాగి పోర్టికోలో ఆగింది.

ఒక పావుగంట గడిచాక జ్ఞానసుందరి బట్టలు మార్చుకుని వచ్చేసరికి అతను కిటికీ తెరలను ప్రక్కకి తొలగించి నిశీధంలోకి చూస్తూ కనిపించాడు.

అతని ఉన్నతమైన మూర్తి ఆమెకు అపురూపంగా, కనులపండువుగా గోచరించింది. ఎంత పొడవుగా, విశాలంగా, దృఢంగా ఆరోగ్యంగా వున్నాడు! ఏమి దేహ దారుఢ్యం! నైట్ డ్రెస్ అతడి శరీరాన్ని చాలాభాగం కప్పేస్తున్నా మణికట్ల నుండి అతడి పొడుగాటి వ్రేళ్ళవరకూ బహిర్గతమౌతూ... తెల్లగా ఏమికాంతితో మెరుస్తున్నాయి! అసలు పైనుంచి క్రిందకు ఓసారి చూస్తే... ఏమి ఉజ్వల, రమణీయమైన విగ్రహం!

అడుగుల సవ్వడి విని అతను వెనక్కి తిరిగాడు. దీపాల్లాంటి అతనికళ్ళు, వాటినుండి వెలువడే కాంతి కిరణాలు... కళ్ళచుట్టూ సుర్మా పులిమినట్లు, కాటుక దిద్దినట్లు సహజంగా అమరిన నల్లని చుట్టుగీత.

ఇతను వ్యభిచారా? ఇతను తాగుతాడా? ఇతనికి బాధ లున్నవా? చంద్రుని సృష్టించగల యీ పురుషుడు ఎందుకు మలిన మాతాడు! మలిన రేఖలు అందర్నీ స్పృశించ లేవుగా.

ఇవి జ్ఞానసుందరి దివ్యమైన అనుభూతులు. ఆమె యిలానూ ఆలోచించగలదని అతనికి తెలియదు.

"ఏమిటి చూస్తున్నావు జ్ఞానా?" అని ప్రశ్నించాడతను చకితుడై.

"మీ రూపు రేఖల్ని, విలాసాల్ని" అని చెబుదామను కుంది ఆమె. ఆమె కపోలాలు సిగ్గుతో ఎర్రబారాయి. ఈ సహజసంపదే లేకపోతే ఆమె సంస్కారంగల మానవిఅయినా అవుగాక, ఏస్త్రీతోనూ ఏ పురుషుడూ కాపురం చెయ్యలేడు.

"మీ హృదయాన్ని."

"అంతేగాని యీ శరీరం నీ కొద్దన్నమాట."

"ఎంత మాట! కాని అసలు హృదయాన్నిబట్టే శరీరం ఏర్పడుతుందనిగా నా వుద్దేశ్యం?"

ఈసత్యం విని అతను చలించాడు. ఈ సత్యం నిజమైతే మనకు కావలసిన వస్తువును ఎంత తేలిగ్గా ఏరుకోవచ్చును! నిర్మల హృదయులే యిలాంటి వ్యాఖ్యానం కూడా చేయ గలరు.

"ఇలాంటి అమృత సత్యాలు యీ భూమికి యిమడవు జ్ఞానా!" అన్నాడు విచారంగా.

కొద్ది క్షణాలు మౌనంగా గడిచాయి. విశాలమైన ఆ గది పాదరసంవంటి విద్యుత్ కాంతితో వెలిగిపోతోంది. మురళి

వచ్చి సోఫాలో కూర్చున్నాడు. "ఇలారా జ్ఞానా!" అని పిలిచాడు. ఆమె వచ్చి అతని కెదురుగా ఆసీనురాలయింది.

అతడామె వదన మండలం మీదనే దృష్టి నిల్పి "నన్ను గురించి నీ ఉద్దేశం ఏమిటి?" అని అడిగాడు.

"మీకు శాంతిని పొందటం తెలీదని" ఆమె సూటిగా సమాధానం చెప్పింది.

అతనో నిట్టూర్పు విడిచి "యింకాచెప్పు" అన్నాడు.

"జీవితంపట్ల మీకు గౌరవం వుందిగాని, నమ్మకం లేదని; జీవితంపట్ల మీకు ఆసక్తి వుందిగాని, నిండుధైర్యంతో దగరకు తీసుకోలేరని, జీవితాన్ని మీరు ఆశించగలరు గాని ప్రేమించలేరని."

"అవన్నీ నాకు తెలీదు. కాని తరచి చూస్తే నిజం కావచ్చు."

ఆమె ఏమీ వ్యాఖ్యానించలేదు.

రెండు మూడు క్షణాలు ఏదో తీవ్రంగా ఆలోచించి కడకతను ఆవేశ, ఉద్వేగాలతో చెప్పసాగాడు. "జ్ఞానా నేను... నేను జీవితంలో పోట్లాడి ఎదిగిన మనిషిని. నేను తిన్నదెబ్బలకు, ఎదుర్కొన్న సంఘటనలకు రాటుతేరి, దేన్నీ లెక్కచేయని ఓ నిర్లక్ష్యపరునిగా, నీతి, జ్ఞానం, అక్కర్లేని అవకాశవాదిగా తయారుకావలసింది. కాని ఆశ్చర్యం! అలా అవలేదు నేను. జీవితశిఖరాగ్రాలను చేరుకోవటంలో ఎంత తపస్సు చేశానో, ఎంత శ్రమించానో, ఎన్నిమార్గాలు అన్వేషించానో లెక్కలేదు. కాని పైకి రావటమనే ఒక లక్ష్యాన్నికేగురి చేశానుగాని, రుచి తెలియని మృగంలా మారలేక పోయాను.

" 'నా' అన్న వస్తువు మీద నాకు అమిత పూజనీయ భావం వుంది. గాఢానురాగం వుంది. దానికి కారణం ఆ విలువ నే నెప్పుడూ పొందలేక పోవటమే.

" 'నా' అనుకునే తల్లిని ఎరుగను. తండ్రి గురించీ అంతే. స్వార్థపరులమధ్య పెరిగాను. అడుగడుక్కీ ఓ తుఫాను, బళ్ళో చేరటానికి యజ్ఞం చేయాల్సి వచ్చింది. నేను అనుకున్నది పొందటానికీ, నాసొమ్ము నేను తినటానికీ, నా విద్య నేను ఎన్నుకోవటానికీ, నా జీవన పథాన్ని నేను నిర్దేశించుకోవటానికీ మహా సంగ్రామాలు జరుపవల్సి వచ్చింది. నిరంతర యాతనలు అనుభవించవలసి వచ్చింది. ఎంత హింస అనుభవించానో లెక్కలేదు. నా లక్ష్యాన్ని సాధించటంలో అనేక తరహాల మనుష్యులతో సంచరించాను. మనుష్యుల్లోని దుర్మార్గాన్ని, క్రౌర్యాన్ని, స్వార్థాన్ని, అవినీతిని ఎంతో దగ్గరగా చూశాను. స్వయంగా అనుభవించాను. అనేక వంచనలకు గురి అయాను. నిజాయితీకోసం, నిజమైన స్నేహంకోసం అలమటించి, ప్రయత్నించి, వాటి నిజస్వరూపానికి తట్టుకోలేక నిప్పులో వేసిన తాటాకులా దహించాను. నిప్పులా మండాను.

"ఇప్పుడు ఆ దశంతా ముగిసి పోయింది. విద్య సంపాదించాను. డబ్బు సంపాదించాను. పేరు వుంది, పరపతి వుంది; ఆరోగ్యముంది, యవ్వనం వుంది.

"కాని 'నా' అన్నవాళ్ళని మాత్రం సంపాదించుకోలేక పోయాను.

"ఆ 'నా' ఎవరు అవుతారు? తల్లీ, తండ్రీ, సోదరుడూ

సోదరీ ఎవరూ లేరు. వారిని మధ్యలో సంపాదించుకోలేం - మధ్యలో సంపాదించుకునేది ఒకర్నే ఒకర్ని - సహచరిని.

“కాని ఎలా జ్ఞానా? నన్ను అణువు అణువునా అర్థం చేసుకుని, ఆరని జ్యోతిలాంటి ప్రేమని ప్రసాదించి, వెన్నెల కిరణం లాంటి చక్కదనాన్ని, ప్రశాంత సాగర కెరటం లాంటి శాంతినీ ప్రసరించగల దేవత ఎలా లభిస్తుంది ?

“ఎందుకంటావా? నా అనుమానానికి కారణ మేమిటంటావా? నాకెంతోమంది స్నేహితులున్నారు; ఎంతోమంది స్నేహితురాళ్లున్నారు. వారిలో ఎవరూ స్వచ్ఛమైన ఆనందాన్నీ, దాంపత్య జీవితంలోని అమరత్వాన్ని పొందుతున్నట్లు అనిపించదు నాకు. చాలామంది ఒకరినొకరు అర్థంచేసుకోరు- అర్థం చేసుకోవటానికి ప్రయత్నించలేదు. ఎవరి ఆవేశాన్ని వాళ్లు అణచుకోరు-ఎవరి లోపాల్ని వారు సరిదిద్దుకోరు. ఒకరి నీడలో ఒకరు శాంతిని పొందటానికి యత్నించరు. ఎవరి స్వార్థాలను, ఆపేక్షలను, భావాలను, భావుకత్వాలను, ఆశయాలను, నడవడికను, దుర్గుణాలను, అరాజకాన్ని, గడుసుతనాన్ని, దర్పాన్ని, ప్రలోభాలను, అలవాట్లను, చాదస్తాలను, అహంభావ ప్రదర్శనను ఒకింత త్యాగం చేసుకోవటానికి ఆరాటపడరు. ఏ ఒకరో చేసినా త్యాగం చేశానన్న డంబాలతో ప్రక్కవారి ప్రాణాలను తోడేస్తూ వుంటారు. కొందరు పెళ్ళయాక యుద్ధాలకు, నిత్యమూ చెలరేగే గడబిడకు అలవాటు పడిపోతారు. కొందరు ఒకరినొకరు అసహ్యించుకుంటూ ద్వేషించుకుంటూ గడుపుతారు. కొందరు ఒకరినొకరు అంటీ అంటనట్లు కాలం వెళ్ళదీస్తారు. కొందరు ఒకరి

కొందరు అసమర్థతతో లొంగిపోయి ఘోర అశాంతితో జీవితాలు వెళ్ళబుచ్చుతారు. చాలామంది యాంత్రికంగా రోజులు జరుపుకుంటారు. కొందరు బయటకు సుఖంగా జీవిస్తున్నట్లు నటిస్తూ లోలోపల కుళ్లుతూ, కుములుతూవుంటారు. కొందరు 'నా జీవితం పెళ్ళిచేసుకుని నాశనం చేసుకున్నాను. పెళ్ళనేది పగవారికైనా వద్దురా బాబూ' అంటూ పదేపదే బయటకు చాటుతూ వుంటారు. ఇహ ఒకరినుంచి ఒకరు విడిపోయిన వారూ, వీధికెక్కినవారూ, నలుగురిలో నవ్వుల పాలైనవారూ అనేకం. ఇంత భయంకరమైనదా పెళ్ళి? ఇంత అశాంతితో కూడినదా తోడు వెదుక్కోవటం? అందుకే యిన్నాళ్ళూ ఎవరిని చేపట్టాలో, ఎవరితో చెలిమిచేయాలో తెలీక నా మనస్సుని ముక్కలు చేసుకుంటున్నాను. రంపపుకోత అనుభవిస్తున్నాను. పోనీ తోడులేకుండా ఒక్కడినే బ్రతుకుదామంటే వంటరితనం మరింత బాధిస్తోంది. ఈ జీవితం ఎందుకు వృధా కావాలి అనిపించేది. ఒక చల్లని దేవత కరుణాకిరణాలు నా యందు ఎందుకు ప్రసరించకూడదు అని ఉక్రోషం వచ్చేది. అందరిలా యాంత్రికంగా జీవించకూడదు. నే నదృష్టవంతుడ్ని కావాలి, ధన్యుణ్ని కావాలని ఒకటే ఆరాటం. కాని ఎవరిని చూసినా అసంతృప్తి. ఎక్కడ తప్పటడుగు వేస్తానో అన్న భయ సందేహాలు. నాపై అమృతధారలు కురియాలి. నాకు కావాలి. ఆ ఎవర్తో ఎవరు? ఆమె ఆకాశం నుంచి క్రిందికిరాలి పడుతుందా? భూమ్మీద సౌజన్యాన్నంతటినీ పుణికి పుచ్చుకుంటుందా? నేను తెలుస్తానా? భార్యాభర్తలనే పదానికి యథార్థమైన నిర్వచనం సృష్టిస్తానా? సత్యమంటే యిదే,

ప్రపంచంలో పదిమందీ ఆచరించేదీ సత్యమనుకోవటం అపోహ అని రుజువు పరుస్తానా? సుఖం, ప్రేమ, ఆనందం అనేవి భ్రమలు కావు. వాటి ఉనికి వుంది ఎక్కడో అక్కడ అని తేటతెల్లం చేస్తానా? ఇదే తపన... ఇదే సంఘర్షణ... కాని... నిన్ను చూశాను ఆనాడు రైల్లో. మొదటి క్షణంలో దిగ్భ్రాంతుడి నైనాను. రెండో క్షణంలో నే వెదుక్కునే పాదాలు యీ తరుణివే అని స్ఫురించింది. మూడో క్షణం నాలో యిన్నాళ్లూ పేరుకుని వున్న మైకాన్ని పోగొట్టింది. స్త్రీ ఎంత మధురశక్తి, స్త్రీ ఎంత మోహాన చలగాటమో, స్త్రీ ఎంత ప్రేమకారుణ్య మూర్తో, స్త్రీ ఎంత దయనీయ కమనీయ సముదాయమో, స్త్రీ ఎంత ఉజ్జ్వల భవిష్యత్తో, స్త్రీ ఎంతటి వెన్నెలనీడో బోధపడింది. నీ కోసమేనా నేను వెదుకుతున్నాను? అవునేమో! నువ్వే నా చెలివి, సహచరివి, తోడువి, నీడవి, నువ్వే నా అన్నీ. ఏదో విద్యుత్ నీనుండి నాలో ప్రవహించింది. కారు చకటిలో కాంతి కిరణం వెలిసింది. హృదయ క్షేత్రంలో ఎల్లెడలా వెలుగు రేఖలు వ్యాపించాయి."

అతని కంఠం శృతి తప్పుతోంది. కళ్ళనుండి అశ్రుబిందువులు స్రవిస్తున్నాయి.

"చెప్పు జ్ఞానా! నా సంపూర్ణ వ్యక్తివి నువ్వేనా?" అంటున్నాడతను గాద్గదికంగా.

జ్ఞాన సుందరి యిహ కన్నీరాపుకోలేక పోయింది. శక్తి చాలలేదు. లేచి మెరుపులా అతని చెంతకు చేరింది. అతని కంఠం చుట్టూ తన మృదుహస్తాన్ని పోనిచ్చి తన దగ్గరకు లాక్కుంది.

"ఏడవకు నువ్వు చిన్ని నాన్నా! నేనున్నాగా నీకు. అవును అన్నీ నేనే. నీ సమస్తం; నీ గుండె, నీ ఉనికి అన్నీ నేనే."

"ఎలా సాధ్యం నీ కని జ్ఞానా? నేనెవర్నీ నమ్మలేను; నన్ను నేనే నమ్మలేను. సుఖముంటే భ్రాంతి అనుకునేవాడ్ని. సంసారంలో సామరస్యంపట్ల లక్ష అనుమానాలున్న వాడ్ని. నువ్వు గారడీ చేయగలవా?" ఆమె స్ఫటికంలాంటి కంఠం మీద తన పెదిమల్ని రాస్తూ అల నస్పష్టంగా ఉచ్ఛరించాడు.

"మురళీబాబూ!" అంది జ్ఞానసుందరి అతని జుట్టులోకి వ్రేళ్లు పోనిచ్చి, సవరిస్తూ.

"చెప్పు" అన్నాడతను కళ్లు మూసుకుంటూ మగతగా.

అలాగే అతన్ని తన గుండెలనిండా నింపుకుని, ఆర్ద్ర స్వరంతో ఆమె చెప్పసాగింది: "నేనెందుకో ఎవర్నీ ద్వేషించలేను మురళీబాబూ! నాకు ప్రపంచమంతా సుందర నందన వనంగా, ప్రేమమయంగా కనిపిస్తుంది. జీవితాన్ని నేను ప్రేమిస్తాను. నా యిష్టం వచ్చినరీతిలో తీర్చిదిద్దుకోగలను. నేనూ దుఃఖపడే సమయాలుంటాయి. కాని మీరు సుఖాన్ని భ్రాంతిగా తీసుకుంటే నేను దుఃఖాన్ని భ్రాంతిగా తీసుకొంటాను.

"ఆశ్చర్యం! నేను వంటరినే. కాని నలుగురిలో మసిలినప్పుడు ఎలా వుంటానో, వొంటరిగా వున్నప్పుడూ అలానే మనగలను. నేను అన్ని రకాల జీవితాలతోనూ ఆనందించగలను.

"పల్లెటూళ్ళో పుట్టాను. కొన్నాళ్ళు పెరిగాను. అక్కడి వాతావరణాన్నీ, అక్కడి మనుషుల్నీ, పొలాలనూ పసుగణాలనూ ప్రేమించాను.

"కొంచెం పెద్దదాన్నయ్యాను! తల్లిదండ్రులతో పట్ణాని కొచ్చాను. అక్కడి నాగరికతనూ, నూతనత్వాన్నీ, క్షణక్షణం మారే అలవాట్లనూ ప్రేమించాను.

"మానాన్నగారి ఉద్యోగరీత్యా కొన్నాళ్ళు ఇంగ్లండులో గడపాల్సివచ్చింది. ఆ విదేశ భాషనూ, వాం వేషభాషల్నీ, కట్టుబాట్లనూ ప్రేమించాను.

"తిరిగి స్వదేశం వచ్చాను. తల్లీ, తండ్రీ గతించారు. నాకు నచ్చిన ఉద్యోగం వెదుక్కున్నాను.

"నన్నుగురించి చెప్పుకోవలసి వచ్చినందుకు కించగానే వుంది. ఎలాంటి వారితోనైనా బ్రతకగల నేర్పు నాకుంది. అన్ని తరహాల మన స్తత్వాలనూ అర్థంచేసుకోగల ఓర్పు నాకు భగవంతుడు ప్రసాదించాడు. నాకు ఓ విరోధి వుంది _ కటుత్వం.

"మురళిబాబూ! దయవుంచి యిది అహంభావంక్రింద భావించకండి. ఆభిజాత్యంక్రింద అపోహపడకండి. బంధం అనే ఉద్యోగానికి దరఖాస్తుపత్రం సమర్పించుకుంటే అందులో అర్హతలు తెలుపుకోవటం నా విధియై వుంది."

ఆమె అతన్ని తన హృదయానికి మరింతగట్టిగా అదుముకుంది. ఇద్దరి గుండెలూ ఒకటిగా, ఒకే లయతో, ఒకే ఒరవడిలో కొట్టుకుంటున్నాయి.

"ఇందాక ఆ రెస్టోరెంటుకు తీసుకు వెళ్ళినప్పుడు కూడా నేను తొట్రుపాటు పడలేదు. వాళ్ళలా తాగితేఏం? నాట్యాలు చేస్తే ఏం? వారు త్రికరణశుద్ధిగా పొందిన ఆనందం నాకు ముచ్చట గొలిపింది. నిజంగా వారు అంత నిర్భయంగా, దాపరికం లేకుండా వారి ఆనందాన్ని వారు పొందుతూన్నందుకు ధన్యులు. అది ఒక జీవితం. అది ఒక పద్ధతి. అది నాకెంతో ఉల్లాసాన్ని కలుగజేసింది.

"అలాగే ఏ జీవితాన్నైనా, ఏ జీవినైనా వారి పరిసరాలను అర్థంచేసుకుని చదవగలిగితే మనకు ఉల్లాసమేగాని అసంతృప్తి ఉండదు.

"సంసారాల్ని విచ్ఛిన్నం చేసుకునే వాళ్ళని గురించి నాకేం తెలీదు. అది దురదృష్టమైనా కావచ్చు; తెలివితక్కువైనా కావచ్చు."

"నా విశ్వాసం ఏమంటున్నదో తెలుసా?"

"ఏమిటి?" ఆమె కౌగిలిలో ప్రపంచాన్ని మరుస్తూన్న మురళి ఆత్రతగా అడిగాడు. "అలాంటి దురదృష్టం నన్నావరించదని." యమునాతీరపు పిల్లనగ్రోవి అది.

ఇది... ఇవేళ... ఈ స్వరం... ఈ క్షణం నిజంగా అపూర్వం. ఆమె వాక్కు అబద్ధం కాబాలదు. సృష్టి ఇంకా అక్కడక్కడా సహజత్వాన్ని, న్యాయాన్ని జనింపజేస్తూనేవుంది.

"నేను సేవకను, పరిచారికను, దేవిని, తల్లిని, సోదరిని,

ప్రేయసిని, మోహినిని, పరిపాలకురాలను. నీ తృప్తిని నేను, నీ బలాన్ని నేను. నీ వెల్తురిని, నీ ఊపిరిని..."

కలలో వాక్యాలుగా అతని వీనుల్లో ప్రతిధ్వనులు. "చాలు... చాలు. సంకల్పం నెరవేరింది."

అతని కీ లోకం తెలియటల్లేదు. "అలుమగలకు అర్థం ఇప్పుడు తెలిసింది. భగవాన్ – సర్వత్రా ఇలానే ఉండేటట్లు చెయ్యి."

ఆమె అతన్ని పూర్తిగా కప్పేసింది.